అప్రమత్తతే... శ్రీరామరక్ష

- గణపతి విగ్రహాల నిమజ్జనాల్లో ప్రమాదాలకు ఆస్కారం
- తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పోలీసులు



పందలపాకలో గణనాథుని నిమజ్జనం చేస్తున్న భక్తులు



బిక్కవోలులో వినాయకుడిని క్రేన్ సాయంతో నిమజ్జనం చేస్తున్న భక్తులు

బిక్కవోలు: గణపతి నవరాత్ర ఉత్సవాలు వాడవాడలా వైభవంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో విగ్రహాల నిమజ్జనోత్సవాలు జోరందుకున్నాయి. వినాయక విగ్రహాల నిమజ్జనాల సందర్భంగా ఏటా ఎక్కడో చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అందుకే ఈ ఏడాది ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పూర్తి స్థాయిలో కమిటీ నిర్వాహకులే బాధ్యత తీసుకోవాలని పోలీసులు చెబుతున్నారు.

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో సుమారు 600 గణపయ్య విగ్రహాలను ప్రతిష్ఠించారు. వాటిలో చాలా విగ్రహాలను సామర్లకోట కాలువ, తుల్యభాగ నదిలో నిమజ్జనం చేస్తారు. వినాయక ప్రతిమల ఊరేగింపు వరకూ సజావుగానే జరుగుతున్నా నిమజ్జనం కోసం విగ్రహాలను నీళ్లలోకి దింపే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. భారీ విగ్రహాలు చాలా బరువు ఉండడంతో వాటిని నదిలో విడిచేందుకు దుందుడుకుగా వ్యవహరించడం, అజాగ్రత్తగా ఉండడంతో అనుకోని ప్రమాదాలు సంభవించి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. గతంలో నిమజ్జనం సందర్భంగా చోటుచేసుకున్న పలు ఘటనలను పరిశీలిస్తే కాలువల లోతు స్థితిగతులు తెలియక ప్రమాదాల బారిన పడ్డట్టుగా స్పష్టమవుతోంది. అలాంటివి జరగకుండా కర్రల సాయంతో లోతు గుర్తించిన తరువాతే కాలువలోకి దిగడం మంచిదని పెద్దలు సూచిస్తున్నారు. భారీ బరువున్న విగ్రహాలను వాహనాల నుంచి దించే సమయంలో అప్రమత్తంగా ఉండడంతో పాటు వాటిని క్రేన్ల సహాయంతో నీళ్లలో దించడమే మేలని చెబుతున్నారు. విగ్రహాల నిమజ్జన ప్రదేశం వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు.

ఇలాంటి ఘటనలెన్నో..

- 2018లో అనపర్తిలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేయడానికి వెళ్ళిన బీసీ హాస్టల్ విద్యార్థి ములగపాక శివరామ సంతోష్(13) కాలువలో గల్లంతయ్యాడు.
- అదే ఏడాది వినాయక నిమజ్జనం సందర్భంగా కాలువ స్నానం చేయడానికి వెళ్ళిన వెదురుపాకకు చెందిన విద్యార్థి దుర్గాప్రసాద్ కొంకుదురు బుడితల మామిడి వద్ద కాలువలో మునిగి చనిపోయాడు.

ఉత్సవ కమిటీలు పర్యవేక్షించాలి



గణపతి నిమజ్జన కార్యక్రమల్ని ఉత్సవ కమిటీలు దగ్గరుండి పర్యవేక్షించాలి. వారిదే పూర్తిస్థాయి బాధ్యత. పిల్లల్ని నిమజ్జనం వద్దకు రానీయకూడదు. బాణసంచా విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా పోలీసు శాఖ సూచించిన నిబంధనలు విధిగా పాటించాలి.

– పి.బుజ్జిబాబు, ఎస్‌ఐ, బిక్కవోలు

అధికారుల పర్యవేక్షణలో



నిమజ్జన సమయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ పంచాయతీ, రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షించేలా చూస్తున్నాం. చట్ట వ్యతిరేక పనులు జరగకుండా సూచనలు, కాలువ వద్ద తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు క్షేత్ర స్థాయిలో వివరిస్తున్నారు.

– కె.పోసిబాబు, తహసీల్దార్, బిక్కవోలు

క్లుప్తంగా

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న సూర్యనారాయణమూర్తి స్వామి వారు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సొంజ్ఞ సమేత శ్రీసూర్యనారాయణమూర్తి స్వామి వారి ఆలయంలో ఆదివారం ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి పరామర్శ



బిక్కవోలు కోఆప్షన్ సభ్యుడిని పరామర్శిస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

బిక్కవోలు: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన బిక్కవోలు గ్రామానికి చెందిన కోఆప్షన్ సభ్యుడు షేక్ ఉస్మాన్‌బాషాను ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి ఆదివారం పరామర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హితకారిణి సమాజం డైరెక్టర్ వి.సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పెదపూడి మండలం కన్వీనర్ గుత్తుల రమణ, కుడుపూడి శ్రీను, చిన్ని తదితరులున్నారు.

ఏయూ పాలకవర్గ సభ్యుడిగా సత్యానందం



మధురపూడి: కోరుకొండ దాసరి అరవాలమ్మ డిగ్రీ కాలేజ్ అధినేత దాసరి సత్యానందం (బాబ్జీ) ఆంధ్రా యూనివర్సిటీ పాలకవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఆయన చాలా ఏళ్లుగా దాసరి అరవాలమ్మ డిగ్రీ కాలేజీ ద్వారా ఎందరో విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం లభించింది. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

వైద్యశిబిరం

మధురపూడి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గాదరాడలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సోము వీర్రాజు, ఏపీఆర్ చౌదరి, నీరుకొండ వీరన్న చౌదరి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల పాదయాత్ర

మధురపూడి: చంద్రబాబు విడుదల కోసం ఆదివారం కోరుకొండ మండలం బూరుగుపూడి నుంచి కోరుకొండ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వరకూ టీడీపీ నాయకుడు కంటే గణపతి పాదయాత్ర చేశారు. ఆయనతో లక్కంసాని రాంబాబు, గూడపాటి పెద్ద ఉన్నారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: నగరంలోని సీతంపేటలో ఆర్యాపుర్యానికి చెందిన కె.అప్పారావు బెల్టుషాపు నిర్వహిస్తున్నాడన్న సమాచారంతో ఎస్ఈబీ రాజమహేంద్రవరం నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ, సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావును అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి తొమ్మిది 180 ఎంఎల్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

అన్ని ఆధారాలతో చంద్రబాబు అరెస్ట్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో సంచలనంగా మారిన స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సీఐడీ అధికారులు పూర్తి ఆధారాలతోనే మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని అరెస్ట్ చేశారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి స్పష్టం చేశారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు రిమాండ్ ఖైదీ 7691గా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో 15 రోజులుగా ఉన్నారన్నారు. స్కామ్‌లో ఆయన హస్తం ఉంది కాబట్టే దేశంలోనే అత్యుత్తమ లాయర్లు సైతం చంద్రబాబును జైలు గోడల మధ్య నుంచి బయటకు తేలేకపోతున్నారన్నారు. అయితే టీడీపీ నాయకులు మాత్రం చంద్రబాబు అరెస్ట్ అన్యాయమంటూ రోడ్డు ఎక్కడం వింతగా ఉందన్నారు. గతంలో జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి చంద్రబాబు, లోకేష్ అండ్‌కో ఇప్పుడేమి మాట్లాడాలో తెలియక సతమతమవుతున్నారన్నారు. ఇన్నాళ్లు తన అనుభవంతో అన్ని వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వచ్చిన చంద్రబాబు పాపం ఇన్నాళ్లకు పండిందన్నారు. ఇన్నాళ్లూ కుప్పిగంతులేసిన నారా లోకేష్ తనను ఎక్కడ అరెస్టు చేస్తారనే భయంతో ఢిల్లీకి వెళ్లిపోయారన్నారు.

చంద్రబాబు అరెస్టు సబబే

మధురపూడి: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో రూ.కోట్ల అవినీతికి పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేస్తే తప్పేముందని వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కిల్ స్కామ్‌లో నకిలీ ఒప్పందంతో రూ.371 కోట్లు కొల్లగొట్టిన చంద్రబాబును అరెస్టు చేయడం సబబేనన్నారు. దానికి టీడీపీ శ్రేణులు ఆందోళనలు, పాదయాత్రలు చేయాల్సిన అవసరం లేదని హితవు పలికారు. చంద్రబాబు న్యాయస్థానం ద్వారా నిర్దోషిగా నిరూపించుకోవాలన్నారు.

హక్కుల కోసం రాజీ లేని పోరాటం

ప్రకాశం నగర్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఎల్పీజీ గ్యాస్ కంపెనీలలో కార్మిక చట్టాలు అమలు కావడం లేదని, కార్మికులు తమ హక్కుల కోసం, సౌకర్యాల కోసం రాజీలేని పోరాటాలు సాగించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక విక్రమ్ హాల్లో ఆదివారం జరిగిన సంఘ 11వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సేనాపతి శివశరణ్, ఉపాధ్యక్షులుగా పి.రాంబాబు, రామకృష్ణ, ఎం.రాజు, ప్రధాన కార్యదర్శిగా జె.వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా డి.శ్రీనివాస్, జి.రాజ్ కుమార్, బాబీ, కోశాధికారిగా వెంకట అప్పారావు, మరో 15 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

నిలిచిన చాగల్నాడు ఎత్తిపోతల జలాలు

రెండు మోటార్లు పాడవ్వడమే కారణం



రంగంపేటలో చుక్క నీరు లేని చాగల్నాడు కాలువ

రంగంపేట: మెట్టప్రాంతమైన రంగంపేట మండలానికి ఎంతో కీలకమైన చాగల్నాడు ఎత్తిపోతల పథకానికి చెందిన రెండు మోటార్లు పాడవడంతో సాగునీరు నిలిచిపోయింది. పాలచర్ల పంపుహౌస్‌లోని రెండు మోటార్లు గత పది రోజులుగా పని చేయకపోవడంతో రైతుల పొలాలకు నీరందడం లేదు. అధికారులు రెండు మోటార్లను మరమ్మతుల నిమిత్తం కాకినాడ పంపించారు. సాధారణంగా ఒక మోటార్ పాడవ్వడం పరిపాటి. కాని ఒకేసారి రెండు మోటార్లు పనిచేయకపోవడం విచిత్రం. చాగల్నాడు ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని 14 వేల ఎకరాలకు నీరందించాల్సి ఉండగా కేవలం 3 వేల ఎకరాలకు మాత్రమే నీరిస్తున్నారు. ఈ ఏడాదైతే ఆ లక్ష్యాన్ని కూడా సాధించలేక చతికిలపడిపోయింది. ఈ ఏడాది జూలై 15న మోటార్లు వదిలినా ఆగస్టు 15కు గాని మండలంలోకి నీరు రాలేదు. ఆ వచ్చిన నీరు కూడా ఎస్టీ రాజాపురం, వడిశలేరు గ్రామాలకు సరిపోయింది. మరో 10 రోజుల తరువాత రంగంపేట గ్రామానికి సగం నీరందింది. అప్పటికే ఒక మోటారు పాడైపోయింది. ఉన్న ఒక్క మోటారుతోనే 15 రోజులుగా కుస్తీ పడుతుండగా ఇప్పుడు రెండో మోటార్ కూడా ఆగిపోయింది. దీనివల్ల మండలంలోని శివారు గ్రామాలైన వడిశలేరు, మర్రిపూడి, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, వెంకటాపురం గ్రామాలకు సాగునీటి ఎద్దడి ఏర్పడింది. అధికారులు వీలైనంత వేగంగా మోటార్లు బాగుచేయించి సాగునీరిచ్చి పొట్టదశలో ఉన్న పంటను కాపాడాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యానికి నాంది

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టడం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యానికి నాంది పలికారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక సచివాలయం–2 పరిధిలో రూ.79.30 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవన సముదాయాలు, సుమారు రూ.16 లక్షలతో నిర్మించిన మూడు సీసీ రోడ్లు, సచివాలయం–4 పరిధిలో రూ.17.50 లక్షల వ్యయంతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌లను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు పూర్తి పారదర్శకంగా, అవినీతికి తావులేకుండా ప్రజల ముంగిటకు చేర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సత్వరంగా అందించేందుకు, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని అన్నారు. అన్నదాతలకు సేవలందించేందుకు ఆర్‌బీకేలు, గ్రామస్థాయిలోనే పౌరసేవలు అందించేందుకు గ్రామ సచివాలయాలు, గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణాలు ప్రభుత్వం చేపట్టినట్లు చెప్పారు. పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు తమ మద్దతును అందించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, సర్పంచ్ వారా కుమారి, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, ఎంపీటీసీ సభ్యులు కొండేటి భీమేష్, బండారు శ్రీనివాసరెడ్డి, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఎస్ఎస్, కాకి సూర్యకుమారి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ వడాల శ్రీనివాసరెడ్డి, పాదూరి డేవిడ్‌రాజు, కోనాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం రక్షణకు యూటీఎఫ్ కృషి



గోకవరంలో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించిన నాయకులు

గోకవరం: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడటానికి యూటీఎఫ్ ఎల్లవేళలా కృషి చేస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. యూటీఎఫ్ 50వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అక్టోబర్ 1న విజయవాడలో నిర్వహించే స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకూ చేపట్టిన ప్రచార జాతా ఆదివారం గోకవరం చేరుకుంది. ఈ జాతాకు మండల యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అనిల్‌కుమార్, కె.శ్రీనివాసు స్వాగతం పలికారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం సమీపంలో యూటీఎఫ్ జెండాను సీనియర్ నాయకురాలు దేవ వాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ పాత పెన్షన్ విధానం సాధన కోసం కలిసి వచ్చే అన్ని సంఘాలతో కలిసి యూటీఎఫ్ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణకుమారి, అధిక సంఖ్యలో నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



పెదపూడిలో ఎంఈఓలకు వినతి పత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

పెదపూడి: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని సమగ్ర శిక్షా ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల ఫెడరేషన్(జేఏసీ) ప్రతినిధులు కోరారు. పెదపూడి మండల విద్యా వనరుల కార్యాలయంలో ఆదివారం ఎంఈఓ–1, 2 వెంకటేశ్వరరావు, సీవీవీ సత్యనారాయణలకు ఈ నెల 25న సామూహిక సెలవు ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఒప్పంద, పొరుగు సేవల ఫెడరేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం విజయవాడలో జరిగే సత్యాగ్రహ దీక్షకు తరలివెళుతున్నామన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు బీర విజయకుమార్, రవి, యదుళ్ల రాజు, ఎస్.ప్రకాశ్, అనసూరి శ్రీనివాసు, ఎల్.వెంకటరమణ, మట్టా సత్యనారాయణ, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నాయకుడు కొరటాలకు నివాళి

ప్రకాశం నగర్: పేపర్‌మిల్లు వద్ద గల సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం కార్మిక నాయకుడు కొరటాల సత్యనారాయణ శతజయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజు లోవ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.పూర్ణం రాజు, సీఐటీయూ నాయకులు లవ కుమార్, సత్తిరాజు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి మన వంతు కృషి చేద్దాం

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో అవసరార్థులను గుర్తించి, వారికి సేవలు అందించడంతో మన వంతు కృషి చేద్దామని మానవత రీజినల్ చైర్మన్ సీపీ రెడ్డి పిలుపు నిచ్చారు. మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ ఉచితంగా నిర్వహిస్తున్న ఫీజర్ బాక్సులు, శాంతి రథం, అంబులెన్స్ సర్వీసులు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మూడేళ్ల జస్వికకు రూ.13,500 ఆర్థికసాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే సంస్థకు చెరుకూరి కృష్ణాజీ ఇనుప బీరువా, మాజీ సెక్రటరీ బీఎస్ఎన్ మూర్తి 20 కుర్చీలు అందించారు. కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ గాంధీ సత్యనారాయణ, ట్రెజరర్ పాల కృష్ణ ప్రసాద్ రెడ్డి, మాజీ అధ్యక్షులు మద్దుల మురళీకృష్ణ, ప్రసాద్, రుద్రమదేవి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

చెరువుల్లా మారుతున్న సిమెంట్ రోడ్లు

- టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం
- డ్రైనేజీలు ఏర్పాటు చేయకపోవడంతో సమస్య



సింగవరంలో సిమెంట్ రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్లపై వర్షం నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్ల పక్కగా డ్రైనేజీలు ఏర్పాటు చేయకపోవడంతో ఈ సమస్య ఏర్పడింది. ఆయా గ్రామాల్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో సిమెంట్ రోడ్లు నిర్మించారు. కానీ డ్రైనేజీలు కట్టలేదు. సీతానగరం వెలమపేటలో సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేసినా డ్రైనేజీ లేకపోవడంతో వర్షం కురిస్తే చెరువులా మారుతోంది. సింగవరంలోని పలు వీధుల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ముగ్గళ్లలోని ఏడోవార్డు వల్లీ దేవసేన సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయం వద్ద సిమెంట్ రోడ్డుపై నీరు నిలిచి, ప్రజలు నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. నిల్వనీటి నుంచి దుర్గంధం వెలువడుతోందని, దోమలు విపరీతంగా పెరిగిపోయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా దీపారాధన



దీపారాధనలో పాల్గొన్న మహిళలు



పందలపాకలో గణపతిని నిమజ్జనం చేస్తున్న మహిళలు

రాజానగరం: దివాన్ చెరువు శివారు బీజాపూరి కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్ర ఉత్సవ మంటపంలో కాలనీ మహిళలు ఆదివారం రాత్రి వినాయకుడు, స్వస్తిక్ ఆకారాలలో దీపారాధన చేశారు. అలాగే రాజానగరం గాంధీ బొమ్మ సెంటరులోని లక్ష్మీ గణపతి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో చిన్నారులు పాల్గొన్నారు.

ఘనంగా బాల గణపతి నిమజ్జనం

బిక్కవోలు: మండలంలోని పందలపాక వెలంపేట ఉసిరి చెట్టు వద్ద కొలువుదీర్చిన బాల గణపతి నిమజ్జనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తీన్‌మార్ డప్పులు, బాణసంచాతో వినాయకుడిని ఊరేగింపుగా తీసుకెళ్లి గౌరిశంకర ఆలయం వద్ద ఉన్న తుల్యభాగ నదీ తీరంలో నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన చేశారు.

చెత్త రహితంగా రాజమహేంద్రవరం

- ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం
- కలెక్టర్ మాధవీలత



సైకిల్ థాన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

పరిశుభ్రతపై అవగాహన

రాజమహేంద్రవరం సిటీ: నగరాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహి సేవ, ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0 కార్యక్రమాలలో భాగంగా ఆదివారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వై.జంక్షన్ నుంచి పుష్కరఘాట్ వరకూ సైకిల్ థాన్ నిర్వహించారు. జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా గ్రామాలను, పట్టణాలను పరిశుభ్రతగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0 కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సెప్టెంబరు 17న ప్రారంభమైన ఈ కార్యక్రమం గాంధీ జయంతి అక్టోబర్ రెండు వరకూ నిర్వహిస్తామన్నారు. యువత ముందుకు వచ్చి స్వచ్ఛందంగా పరిసరాల పరిశుభ్రతకు తమవంతు సహకారం అందించాలన్నారు. నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ శనివారం నిర్వహించిన గోదావరి ఘాట్ పరిశుభ్రత కార్యక్రమంలో 2వేల మంది ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారన్నారు. ఈ రోజు సైకిల్ ర్యాలీ ద్వారా స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంపై ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రానున్న శుక్రవారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో మెగా ఐఎస్ఎల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నగర ప్రజలందరూ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ యశ్వంత్ కుమార్, మున్సిపల్ హెల్త్ అధికారి డాక్టర్ ఎ.వినూత్న, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ దిలీప్ కుమార్, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, జేసీఐ సభ్యులు పాల్గొన్నారు.

లాభాల బాటలో ఆర్యాపురం బ్యాంకు

రాజమహేంద్రవరం సిటీ: ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లాభాల బాటలో పయనించడం చాలా సంతోషకరమని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. బ్యాంక్ ఛైర్ పర్సన్ గిరజాల రామకృష్ణ తులసి అధ్యక్షతన స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం బ్యాంకు 104వ మహాజన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ ఈ కోఆపరేటివ్ బ్యాంకుకు లక్ష మంది సభ్యత్వం ఉండటం అంటే, బ్యాంకు సేవలపై ఖాతాదారులకు ఎంత విశ్వాసం, అభిమానముందో స్పష్టమవుతోందన్నారు. వందల కోట్ల టర్నోవర్‌తో ఖాతాదారులకు సంతృప్తికర సేవలు అందిస్తున్న ఈ బ్యాంకు త్వరలోనే ఏ గ్రేడ్ స్థాయికి చేరగలదనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ బ్యాంకు పాలక వర్గాన్ని ప్రభుత్వం నియమించిందని, వారి సమర్థత కారణంగా బ్యాంకు లాభాల బాటలో పయనిస్తోందన్నారు. ఏ ఆశయంతో ఈ బ్యాంకును దివంగత సరిపెల్ల విశ్వేశ్వర ప్రసాద్ స్థాపించారో, ఆయన ఆశయ సాధన దిశగా పాలకవర్గం, అధికారులు కృషి చేయాలని సూచించారు. అనంతరం మహాజన సభకు విచ్చేసిన సభ్యులందరికీ బ్యాంకు సమకూర్చిన గిఫ్టులను ఎంపీ భరత్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, బ్యాంకు సీఈఓ కొండేటి స్వరాజ్యలక్ష్మి, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, నగర బీసీ సెల్ చైర్మన్ మజ్జి అప్పారావు, బ్యాంకు పాలకవర్గ సభ్యులు మజ్జి నూకరత్నం, నక్కెళ్ల బాబూరావు, మార్గాని సురేష్, పెంకే సురేష్ కుమార్, పతివాడ రమేష్ బాబు, రాయుడు గణేష్, వీణం వెంకటేశ్వరరావు, గొర్రిపాటి లీలా గంగాధరరావు, వెంట్రపాటి సురేష్, యర్రా ప్రసాదరావు పాల్గొన్నారు.